## క్లుప్తంగా

### మార్కెట్‌కు సెలవులు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 29న గుడ్ ఫ్రైడే సందర్భంగా సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కావడంతో వరుసగా మార్కెట్‌కు 3రోజులు సెలవులు ఉండగా, తిరిగి ఏప్రిల్ 1వ తేదీన మార్కెట్‌లో కొనుగోళ్లు జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ఎన్‌ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడిగా సాయిరాజీవ్



మహబూబాబాద్ రూరల్: ఎన్‌ఎస్‌యూఐ టౌన్ వైస్ ప్రెసిడెంట్‌గా పెనుగొండ సాయిరాజీవ్ నియామకం అయ్యాడని జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల చరణ్ గౌడ్ గురువారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ, రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, రాష్ట్ర ఇన్‌చార్జ్ అక్షయ్ లాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చంద్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, తదితరులకు సాయిరాజీవ్ కృతజ్ఞతలు తెలిపాడు.

### రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యుడిగా కాశయ్య



చిన్నగూడూరు: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యుడిగా భూపతి కాశయ్య గౌడ్ ఏకగ్రీవంగా నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల సోమయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పంచలోహ విగ్రహాల వితరణ



గార్ల: గార్లలోని తూర్పు ఆంజనేయస్వామి దేవాలయానికి గార్లకు చెందిన దాత అత్తులూరి సత్యం రమాదేవి దంపతులు రూ.81,000 విలువ గల రాముడు, లక్ష్మణుడు, సీతాదేవి, ఆంజనేయస్వామిల పంచలోహ ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఈసందర్భంగా దాత మాట్లాడుతూ.. శ్రీరామనవమి సందర్భంగా రాముడి కల్యాణం కోసం ఈ విగ్రహాలను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పుల్లఖండం రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, రాంబాబు, అత్తులూరి భాస్కర్, జక్కుల పాండు రంగారావు, వేమిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ప్రజలు సహకరించాలి



డోర్నకల్: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు కోరారు. సీరోలు మండల పరిధిలోని చిలుకొయ్యలపాడు, అందనాలపాడు, మన్నెగూడెం, మోదుగ్గడతండాలో గురువారం కేంద్ర బలగాలతో డోర్నకల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

### ఐదెకరాల్లో మొక్కజొన్న దగ్ధం



బయ్యారం: తునికాకు మోడం కోసం పెట్టిన మంటలు మొక్కజొన్న చేనుకు అంటుకొని దగ్ధమైన ఘటన గురువారం మండలంలోని మిర్యాలపెంట పంచాయతీలోని సాంబతండాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన భూక్య శ్రీ రాములు, బోడ లస్కర్, బోడ మంగీలాల్ యాసంగిలో 5 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను కోసి కుప్పలుగా ఉంచారు. ఆ సమయంలో చేను సమీపంలోని అటవీప్రాంతంలో తునికాకు మోడం కోసం పెట్టిన మంటలు చేనుకు వ్యాపించి అందులో ఉంచిన కంకులు దగ్ధమయ్యాయి. రూ.2 లక్షల మేరకు ఆస్తినష్టం జరిగిందని రైతులు పేర్కొన్నారు.

# సీసీ రోడ్డుకు మిషన్ భగీరథ నీరు

- క్యూరింగ్ కోసం జీపీ ట్యాంకర్ల ద్వారా సరఫరా
- అసలే వేసవి కాలం.. తాగునీటి ఇబ్బందులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎడ్జెర్లలో జీపీ ట్యాంకర్‌లోకి ఎక్కిస్తున్న మిషన్ భగీరథ నీరు

మరిపెడ రూరల్: వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం ప్రజలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా చేస్తుంటే, మరికొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం వేసవిలో ప్రజల దహార్తి తీర్చే నీటిని సీసీ రోడ్డు క్యూరింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ఈ సంఘటపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తీరు మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎడ్జెర్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో ఇటీవల ఉపాధి హామీ నిధులు రూ.5లక్షల సీసీ రోడ్డు మంజూరు అయింది. సీసీ రోడ్డును దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు రోడ్డు క్యూరింగ్ కోసం కాలనీకి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్ గేట్ వాల్ ద్వారా నీటిని తోడుతున్నారు. నీటిని ఎడ్జెర్ల, గుర్రప్పతండా గ్రామ పంచాయతీలకు చెందిన రెండు ట్రాక్టర్ల ట్యాంకర్ల ద్వారా మిషన్ భగీరథ నీటిని సీసీ రోడ్డుకు ఉపయోగిస్తున్నారు. ఓ పక్క వేసవి మొదలై తాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే మరో పక్క ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నీటిని సీసీ రోడ్డుకు ఉపయోగించడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇంతటి దారుణం జరుగుతుందని, విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



వర్షశ్రీకి బహుమతి అందజేస్తున్న బ్యాంక్ అధికారి

తొర్రూరు రూరల్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి నినాదాల పోటీల్లో మండలంలోని చెర్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వర్షశ్రీ ప్రథమ స్థానం సాధించింది. గురువారం పాఠశాలలో వర్షశ్రీని సన్మానించి, నగదు రూ.2వేలతోపాటు బహుమతులను అందించారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజర్ మూర్తి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంక్ సేవలు అందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారి సుంకర రమేష్, హెచ్ఎం మహంకాళి బుచ్చయ్య, ఉపాధ్యాయులు ఎంఎస్ భాను, తనూజ, శ్రీనివాస్, మల్లేశం, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు సరికాదు

మరిపెడ రూరల్: సోషల్ మీడియా వేదికగా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి అన్నారు. గురువారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేదల పక్షపాతి పార్టీ అని, సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. ఎమ్మెల్యే బూత్ స్థాయి కార్యకర్తలకు కూడా కాంట్రాక్ట్ పనులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజల కోసం నాడు ప్రతిపక్ష నాయకుడిగా నేడు అధికార పక్షం తరఫున ప్రజల కోసం అహర్నిశలు పని చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం శ్రేయస్కరం కాదన్నారు. అక్రమాలకు ఎమ్మెల్యే అడ్డుకట్ట వేస్తున్నారన్న అక్కసుతో ఇలాంటి వ్యక్తిగత ఆరోపణలకు పూనుకున్నారని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలను రఘువీరారెడ్డి తీవ్రంగా ఖండించారు.

### నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలోని భూక్య కాంతి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 50కిలోల నల్లబెల్లం, 5కిలోల పటికను స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక రెడ్డి గురువారం రాత్రి తెలిపారు. కాంతిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### గుడుంబా స్వాధీనం

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ధరావత్ శివాజీ ఇంట్లో అక్రమంగా గుడుంబా అమ్ముతుండగా పోలీసులు పట్టుకొని అతని వద్ద నుంచి 6లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ గురువారం తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సోమయ్య

మహబూబాబాద్: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా ద్వితీయ మహాసభను జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు అధ్యక్షత నిర్వహించారు. ఈసందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ కార్డు, జర్నలిస్టుల స్థలాల విషయంలో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. అనంతరం యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మట్టూరి నాగేశ్వర్‌రావు, కార్యదర్శిగా కె.యాకయ్య, కోశాధికారిగా వై.కిరణ్, ఉపాధ్యక్షులుగా ఉపేందర్‌ఐలయ్య, శేఖర్, రామ్మూర్తి, సహాయ కార్యదర్శులుగా ఉపేందర్, అమర్‌నాథ్, కృష్ణవేణి, కృష్ణారెడ్డి, నిరంజన్, మహేందర్‌తోపాటు 12మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఆనందం, విజయ్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, మా అసోసియేషన్ అధ్యక్షుడు బోడ్డుపల్లి ఉపేందర్, అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి



డైరీని ఆవిష్కరిస్తున్న ఈసం నారాయణ, సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ యూనివర్సిటీ, కళాశాల, పాఠశాలలో దళిత, గిరిజన విద్యార్థులు చాలా వరకు చదువుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యారంగాన్ని ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఈసం నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ డైరీని ఈసం నారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు మధ్యల వీరస్వామి, పగడయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో నియోజకవర్గం



మాట్లాడుతున్న నాయకులు

కురవి: విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ విజయం తర్వాత డోర్నకల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తుందని సీరోలు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మల్లిశెట్టి వేణు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మహబూబ్‌పాషా అన్నారు. గురువారం సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాంచంద్రు నాయక్ గెలిచిన తర్వాత గత పాలకుల అనుచరులు అబాసుపాలు చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని తెలిపారు. వందరోజుల్లో సీరోలు, కురవి మండలాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నల్లబెల్లం, ఇసుక , బియ్యం అక్రమ రవాణాను అరికట్టినట్లు పేర్కొన్నారు. వీటిని గత పాలకులు జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు జెట్రిపోతుల మహేష్, గాండ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు రావడంలేదని రాస్తారోకో



బిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో 15 రోజులుగా తాగునీరు రావడంలేదని గ్రామస్తులు బస్టాండ్ సెంటర్ బజారులో రోడ్డుపై రాస్తారోకో నిర్వహిచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పలుమార్లు అధికారులకు చెప్పిన స్పందించడం లేదన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తుతు రామనర్సయ్య, యాకన్న, సుధాకర్, యాకయ్య, పద్మ, మహమ్మద్ యాకుబ్, ఉపేంద్ర పాల్గొన్నారు.

## పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించాలి



మాట్లాడుతున్న ప్రియాంక

డోర్నకల్: పిల్లలకు పుట్టుకతో వచ్చే వ్యాధులపై తల్లిదండ్రులకు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు ప్రియాంక తెలిపారు. మండలంలోని పెరుమాళ్లసంకీస, జోగ్యాతండాలలో గురువారం పిల్లలకు పుట్టుకతో వచ్చే వ్యాధ్యులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రియాంక మాట్లాడుతూ.. పిల్లలకు గ్రహణమొర్రి, దృష్టిలోపం, వంకర కాళ్లు, డౌన్ సిండ్రోమ్, గుండె సంబంధిత వ్యాధులు, దృష్టి లోపం, రెటినోపతి లాంటి జబ్బులు పుట్టుకతో వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అలాంటి వ్యాధులను త్వరగతిన గుర్తించి సకాలంలో చికిత్స అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు శ్రీజ, ఏఎన్ఎం స్వప్న, అంగన్‌వాడీ కార్యకర్త గండు సీత పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలను విడనాడాలి



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

గార్ల: మూఢనమ్మకాల నుంచి ప్రజలను చైతన్య పర్చేందుకే గ్రామాల్లో పోలీస్ కళాజాతా బృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని గార్ల-బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై ఎన్.జీనత్ కుమార్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి మండలంలోని చిన్నబంజర గ్రామంలో జిల్లా పోలీసుల కళాబృందం నిర్వహించిన కళా ప్రదర్శనలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువకులు చెడువ్యసనాలు మానుకొని, సన్మార్గంలో పయనించినప్పుడే అన్నిరంగాల్లో రాణిస్తారని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, కానిస్టేబుళ్లు శ్రీను, మంగీలాల్, హోంగార్డులు పాల్గొన్నారు.

## రథంపై స్వామివారి ఊరేగింపు



స్వామి వారిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

గార్ల: గార్ల వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా అత్తగారి గ్రామమైన డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి గురువారం బయలుదేరారు. ఈసందర్భంగా అమ్మపాలెం గ్రామస్తులు ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన రథంపై వేంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి గార్ల పురవీధుల్లో మేళతాలాలతో ఊరేగింపుతో తీసుకెళ్లారు. అర్చకులు అచ్చుత్‌స్వామి మాట్లాడుతూ.. అమ్మపాలెంలో స్వామివారికి 29న అభిషేక పూజలు, కుంకుమ పూజలు, దీపోత్సవం, 30న హోమం, సాయంత్రం తెప్పోత్సవం స్థానిక పాకాల ఏటిలో నిర్వహిస్తామని, 31న స్వామివారు గార్లకు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లం నరేందర్, అనుమయ్య, బసవయ్య, కోటయ్య, భిక్షపతి, రఘు పాల్గొన్నారు.

## ప్రజలకు న్యాయ సలహాలు అందిస్తాం



డైరీ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

తొర్రూరు: ప్రజలకు న్యాయ సలహాలు అందించేందుకు ఎప్పుడూ ముందుంటామని తొర్రూరు న్యాయవాదుల సంఘం నాయకులు బొమ్మనబోయిన మహేందర్ అన్నారు. తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ డైరీని గురువారం డివిజన్ కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు ఆవిష్కరించారు. మహేందర్ మాట్లాడుతూ.. పలు వివాదాల్లో చిక్కుకొని కోర్టు కేసులు ఉన్న సామాన్యులకు తగు న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోపాల్, ఘనపురం రామకృష్ణ, అశోక్, మల్లేష్, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.

### ఆలయానికి గంట బహూకరణ

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని గోపాలపురంలో ఉన్న పెద్దమ్మతల్లి, రేణుక ఎల్లమ్మతల్లి ఆలయానికి మేక రోహిణి, నరేందర్ దంపతులు రూ.9,600 విలువైన 5.5కిలోల లోహగంటను గురువారం బహూకరించారు. ట్రస్ట్ ఛైర్మన్ రాజు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వెంకన్న, డైరెక్టర్లు భూముల శ్రీరాములు, తోట యాదగిరి, పులుగుజ్జ ఐలయ్య పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ఎన్నికల కోడ్‌ను ఉల్లగించి ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా మున్నేరు వాగు నుంచి అభయా చెరువు వరకు కాల్వను, బావిని తీసిన వారిపై చర్య తీసుకోవాలని లక్ష్మీపురం గ్రామ రైతులు భూక్యా శారద, సీతారామ్ నాయక్ జెడ్పీ సీఈఓ నర్మదకు గురువారం వినతిపత్రం అందజేశారు.

### పరామర్శ..

కేసముద్రం: కేసముద్రంవిలేజీకి చెందిన బెజ్జం వెంకన్న అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు గురువారం జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, జాతీయ కార్యదర్శి భాస్కర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామచంద్రరావు, రవికుమార్, రమేష్, బెజ్జం ప్రేమ్‌కుమార్, పప్పుల వెంకన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

### నివాళి

గార్ల: సీపీఐ మండల సీనియర్ నాయకుడు పాతూరి రామయ్య మరణం సీపీఐకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి, వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు అన్నారు. గురువారం మద్దివంచ గ్రామంలో రామయ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకన్న, రమేష్, బిక్షమయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

### నేడు బిషప్ ఉడుములబాల రాక

మహబూబాబాద్ రూరల్: గుడ్ ఫ్రైడే సందర్భంగా వరంగల్ మేత్రాసనం బిషప్ డాక్టర్ ఉడుముల బాల నేడు జిల్లా కేంద్రానికి వస్తున్నారని ఫాతిమా మాత దేవాలయ ఫాదర్ సైమన్ గురువారం తెలిపారు.

### బీఆర్ఎస్‌కు రాజీనామా



తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషన్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం తెలిపారు. బీఆర్ఎస్ విధానాలు నచ్చక పార్టీకి రాజీనామా చేస్తున్నానని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు రాజీనామా పత్రాన్ని పంపించినట్లు తెలిపారు. రాజీనామాను ఆమోదించాలని, త్వరలో రాజకీయ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని పేర్కొన్నారు.

### సామూహిక సీమంతాలు



నెల్లికుదురు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులకు, కిషోర బాలికలకు పోషక ఆహారంపై సీడీపీఓ హైమావతి అవగాహన కల్పించారు.

### పెద్దగాదె రాజు, చిన్న గాదెరాజు జాతర

గంగారం: మండలంలోని పుట్టలభూపతి గ్రామంలోని సోలం వారి ఇలవేల్పు 6వ గొట్టు బెరంబోయిన గోత్రం వారి ఆధ్వర్యంలో పెద్ద గాదెరాజు-చిన్న గాదె రాజు జాతర రెండో రోజు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4గంటలకు దేవుడిని తీసుకువచ్చారు. ఆదివాసీ సంస్కృతీసంప్రదాయాల ప్రకారం గద్దెలపై దేవుడిని ప్రతిష్ఠించారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



మహబూబాబాద్ రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో గురువారం జరిగింది. వివరాలు.. మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన కొలిశెట్టి సత్యనారాయణ ద్విచక్రవాహనంపై వెళ్తూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్కూల్ బస్సు డ్రైవర్ మిడతపల్లి భాస్కర్‌కు ఆ సెల్‌ఫోన్ రోడ్డుపై దొరికింది. వెంటనే సెల్‌ఫోన్ పోలీసులకు అప్పగించాడు. రూరల్ ఏఎస్సై సూరయ్య, పీసీలు ఉమా, బాపూజీ ఫోన్ పోగొట్టుకున్న సత్యనారాయణకు సమాచారం అందించి, ఫోన్ అప్పగించారు. భాస్కర్‌ను పోలీసులు, స్థానికులు అభినందించారు.

### బతుకమ్మ చీరలు భద్రమేనా?

డోర్నకల్: గతేడాది అక్టోబర్ నెలలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలకు మొదటి విడతగా 12,600 చీరలను మహిళలకు పంపిణీ చేశారు. రెండో విడత పంపిణీ కోసం అక్టోబర్ మొదటి వారంలో మరో ఐదువేల చీరలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పంపిణీ నిలిచింది. దీంతో 5వేల చీరలను ఫైర్‌స్టేషన్‌లోని ఓ గదిలో భద్రపరిచారు. చీరలను భద్రపరిచి ఐదు నెలలు దాటినా అధికారులు పట్టించుకోకపోవడంతో చీరల కాటన్లకు చెదలు పట్టడం, ఎలుకలు ధ్వంసం చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఆత్మహత్యకు పాల్పడొద్దు




మరిపెడ: ఎన్ని కష్టాలు ఎదురైన ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలే తప్పా.. ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. గురువారం మరిపెడ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్సై తాహెర్ బాబాతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సులో అశోక్ మాట్లాడారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా పదేళ్లుగా ఆత్మహత్యలపై అవగాహన కల్పిస్తూ 28 మంది ప్రాణాలు కాపాడినట్లు వివరించారు. కార్యక్రమంలో సెకండ్ ఎస్సై సంతోష్, సంస్థ నిర్వాహకులు నరేందర్ పాల్గొన్నారు.